కథానిక:

# ఉభయభ్రష్టత్వం

శ్రీ గోవిందరాజు రామకష్ణరావు

గురునాథం వయస్సుమళ్ళిన బ్రాహ్మణుడు. ఆస్తికొంచె మో-గొప్పో ఉన్నది. కాని సంతానంమాత్రం శూన్యం. తనకయితే ఏలూరిపిల్లవాడ్ని పెంచుకోవాలని ఉంది. కాని భార్య రంగమ్మ, ఊ, అన్లా. రంగమ్మకు పూర్తిగా మేనకోడలు శాంతను దగ్గర పెట్టుకోవాలని సంకల్పం. అంచుచేత గురునాథంగారి తలపు ఊరుగాట



ల్లోకి వచ్చింది. మగపిల్లవాడయితే కొత్త తులసీదళం నోట్లో వేస్తాడనీ, కుటుంబం నిలుపుతాడనీ గురునాథంగారి ఆశ. కాని ఆయన రంగమ్మని ఎదిరించి యే పనీ చేయలేదు. లేకపోతే దత్తత మునుపే జరిగిపోయేది. ఎట్లాగయినా ఆమెను ఒప్పించాలని ఆలోచిస్తున్నాడు. శాంతను కూడా చేర్చే పద్ధతుంటే తప్పక అంగీకరిస్తుంది అనుకున్నాడు భోజనసమయంలో-

గురునాథం: ఏమే! చూడు, మీ శాంతకి ఎన్నోయేడు ఇప్పుడు?

రంగమ్మ: అలా అడుగుతున్నారేం? ఎప్పుడూ లేందీ!

గురు: ఆ!-అసలు కనుక్కుందామని.

రంగ: ఆ!-వడ్డీ సంగతి చెప్పండి, చెప్తా.

గురు: మొన్న ఏలూరినుంచి తీసుకురాలా-అతనికి యీడో, కాదో తెలుసుకుందామని.

రం: ఆ - ఈ డే, ఆ ప్రస్తాపనంతో ఎందుకూ?

గురు: చెప్తా. శాంతను ఆ అబ్బాయికిచ్చి చేస్తే బాగుంటుందేమో నని నా ఆలోచన. శాంత మనయింటికి రావటం నీకు యిష్టమేగా? ఏమంటావ్?

రం: (ముఖంలో సంతోషం) అలాకానివ్వండి.

గురు: ఇది ఖాయమే సంటావా?

రం: ఆ. అయితే ఒక్క విషయం. మిమ్మల్ని ఏదో ఉద్ధరిస్తాడని నా పేర ఉన్న ఆస్తి అంతా ఆయన పేర పెట్టే మాపని మట్టమవుతుంది. కాబట్టి యీ ఆస్తి పెళ్ళివరకు నా పేర నే ఉండాలి. వివాహకాలమందు ఆస్తిలో సగం పిల్లపేరున, ముందున్న మండువాయిల్లు పిల్లవాడి పేర పెట్టవచ్చు. ఇలాగని చెప్పి వారు ఒప్పుకుంటే పిల్లడ్ని తీసుకురండి. నా అభ్యంతరం లేదు.

గురు: ఇదీ బాగానే ఉంది. మంచి రోజు చూసి సెటిలుచేసుకొస్తా.

* * *

శేషగిరిరావుగారు చాలా పెద్దవారు. సాధారణకుటుంబీకుడు. భార్య గతించింది. కలెక్టరాఫీసులో ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ఇద్దరు కొడుకుల్లో గోపాలరావు పెద్ద. సత్యం రెండోవాడు. గోపాలరావు అత్తవారిల్లు ఊళ్ళోనే. మామగారు చెప్పిందే మనువాక్యం. శేషగిరిరావుగారికీ గురునాథంగారికీ బాల్యంనుంచి మంచి స్నేహం. ఒకరంటే ఒకరికి గట్టినమ్మకం, ఆప్యాయం. అనుకున్న ప్రకారంగానే గురునాథం ఏలూరు వచ్చి శేషగిరిరావుగార్ని కలుసుకున్నారు. శేషగిరిరావుగారికి

ఉండే నమ్మకంమూలాన గురునాథంగారు ఆస్తిసంగతి చెప్పినట్లే ఒప్పుకుని, కాగితాల వ్రాతల విషయం కదల్చలేదు. శేషగిరిరావుగారు "అన్నగారూ! సత్యాన్ని మీకు దత్తత యివ్వటం ఖాయం. భారం అంతా మీదే. నాకన్న మీకే ఎక్కువ ప్రేమ, బాధ్యత." అని చెప్పాడు. సరే అనిపించుకుని యింటికి తిరిగి వచ్చాడు గురునాథం.

* * *

దత్తతకోసం తొందరపడుతున్నాడు గురునాథం. పెద్దవాడు, అందులో అస్వస్థత. ఎవ్వరేం చెప్పగలరు, ఏ క్షణంలో ఏమి రానుందో, తలపెట్టిన కార్యం సానుకూలం అయితే దిగులుండదు. వంట్లో అనారోగ్యం మూలంగా వివాహం తర్వాత జరుపుదామని నిశ్చయించారు. దత్తత లగ్నం కూడా త్వరలోనే కుదిరింది. అందరికి లేఖలు పంపారు. బావమరిది పిల్లలు ముందుగానే వచ్చారు పనులు చక్కబెట్టటానికి. దత్తత రెండు దినాలుందనగా శేషగిరిరావుగారు, గోపాలరావు, వాని భార్య, సత్యం, ఇంకా కొందరు బంధువులు వచ్చారు. గురునాథం పని మరీ క్షీణంగా ఉంది. దత్తత అని ఏదో మొక్కుబడిలా నెరవేర్చారు. దత్తస్వీకారపత్రం కూడా వ్రాయలేదు. నిమ్మదిమీద వీలునామా అవీ వ్రాయిద్దా మనుకున్నాడు శేషగిరిరావుగారు.

రంగమ్మ తన మేనకోడల్ని క్రొత్త చుట్టాలందరికి చూపించింది. "పిల్లకేం చందనంబొమ్మలా ఉంది. చిలకా గోరింకల్లా ఉంటారు. గురునాథంగారికి కులాసాగా ఉంటే ఆ మూడుముళ్ళు కూడా పడిపోయేవి," అన్నారు అందరూ, ముఖస్తుతిగా. సత్యం రెండో యేడు స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు. వయస్సు పద్దెనిమిది. బస్తీజీవితం బాగా తెలిసినవాడు. చక్కని రూపురేఖలు కలవాడు. పల్లెటూరి పద్ధతినే పిల్లని పిల్లవాడికి చూపెట్టేందుకు అమ్మలక్కలు హంగామా అంతా చేశారు. శాంతకి పదమూడేళ్లు. లావుగా, చామనచాయగా ఉంటుంది. పెద్దబాలశిక్ష చదివింది. ఇంగ్లీషు అక్షరాలు కూడా రావు. రూపురేఖల్లో ఆకర్షణ తక్కువ. తలెత్తి చూచాడు సత్యం తనకు నియమింపబడ్డ వధువును. సత్యంకు ప్రథమదర్శనంలోనే వైముఖ్యం, హేయం కలిగినాయి. మధుర భావాలకు నిలయమైన తన మనస్సుకు, శాంతను తాను స్వీకరించాలా, అనే భావం తగులగానే, బెడ్డ గిరవాటుకు తెనె



పట్టునుంచి విజృంభించే తేనెటీగలవలె సత్యాన్ని వివిధ ఆలోచనలు చుట్టుముట్టాయి. తల వాల్చి ఏమీ మాట్లాడకుండానే కూర్చున్నాడు. సిగు కార్యాలని సమర్థించారు అమ్మలక్కలంతా. క్రమంగా ఎవరి గ్రామాలకు వారు చేరుకున్నారు. శాంత తల్లితండ్రులుకూడా వెళ్ళిపోయారు. సత్యం, గురునాథం, రంగమ్మ మిగిలారు.

• • *

వేసవికాలం సెలవల తర్వాత సత్యాన్ని కాలేజీలో ప్రవేశపెట్టటానికి గురునాథం నిశ్చయించాడు. సత్యం పెంపుడు తల్లితండ్రులకు అనుగుణంగానే ఉంటున్నాడు. శేషగిరిరావుగారు కాలంచేశారని హఠాత్తుగా కబురు వచ్చింది. సత్యం ఏలూరు వెళ్ళి కర్మఅయిన తర్వాత తిరిగి వచ్చాడు. గోపాలరావు మామగారి సలహాతో ఆస్తినంతా భార్యపేర పెట్టించేశాడు వెంటనే.

సత్యం కాలేజీలో ప్రవేశించాడు. ప్రతివారం వచ్చి గురునాథంగార్ని చూస్తూనే ఉన్నాడు. సత్యానికి శాంతవిషయం గుర్తువచ్చినప్పుడల్లా బల్లెపు పోటులా ఉండేది. క్రమక్రమంగా శాంత మీద జుగుప్స ఎక్కువవుతోంది సత్యానికి. ఇష్టంలేదని రంగమ్మపిన్నితో చెప్పుదామనుకున్నాడు. కాని తగిన ధైర్యం లేదు. అయినా ముందుగా తన అన్నతో చెప్పిచూద్దామనుకున్నాడు. ఒకమారు వెళ్ళినప్పుడు అన్నతో చెప్పాడు. దశరా సెలవలకు ఏలూరు వెళ్ళినప్పుడు గురునాథంగారికి యీ విషయం చెప్పమని అన్నని కోరాడు. గోపాలరావు తను జోక్యం కలుగ చేసుకోవటం మంచిదికాదని జవాబిచ్చాడు. నిరాశతో సత్యం తిరిగి వచ్చాడు.

గురునాథంగారికి ఎక్కువ అనారోగ్యం ఏర్పడింది. స్పృహకూడా తగ్గిపోతోంది. ధారకంకూడా పోవటంలేదు. పరిస్థితి ప్రమాదంగానే ఉన్నది. వెంటనే అన్నకు టెలిగ్రాం యిచ్చాడు. మామ సలహా మీద గోపాలరావు వచ్చాడు. అప్పటికి గురునాథంగారి ప్రాణం అంత్యదశలో ఉంది. ఇక లాభంలేదని గురునాథాన్ని బయటపెట్టారు. సత్యం గ్లాసులో నీళ్లు, తులసీదళం వేసుకొచ్చి ఉద్ధరిణితో మూడుసార్లు పోశాడు. అంతే, గురునాథం యీ లోకాన్ని వీడి పోయాడు. గోపాలరావు కర్మ పూర్తిఅయ్యేవరకు ఉండి తిరిగి ఏలూరు వెళ్ళిపోయాడు.

* • •

సత్యానికి అన్నివిధాలా మనోవ్యాకులత ఇనుమడిస్తోంది. తనకు సహాయంగా నిల్చేవారు ఎవరూ లేరని గ్రహించాడు. కాలయాపన నష్టప్రదమనుకొని తనకు భూమి, ఇల్లు సంగతి కాగితా • వ్రాతకోతల విషయం, శాంత సంబంధ విషయం రంగమ్మపిన్నితో మాట్లాడేందుకు నిశ్చయించుకున్నాడు. ఒకనాడు. ఏలాగో ధైర్యంచేసి—

సత్యం: పిన్నీ! వీలునామావిషయం ఏం చేశారు? దురదృష్టవశాత్తూ బాబాయి చేతుల్తో జరగకుండా పోయింది.

రంగమ్మ: ఆస్తిఅంతా ఎలాగా మీకే గదా నాయినా! నేనూ అదే తొందరపడ్తున్నాను. శాంతపేరో నీపేరో పెట్టాను. ఇదిగో త్వరలో ఆ మూడుముళ్ళు పడితే నా బాధ్యత తగ్గుతుంది. మనలో మాట మన శాంతని చూశావుకదూ?

సత్యం: (ముఖంలో కొంతనిరుత్సాహం) అవును, పిన్నీ అదే నీకు చెప్దామనుకున్నా.

రంగ: మీబాబాయికి కల్యాణం చూసే భాగ్యం లేకపోయింది.

సత్యం: (ముఖంలో బాధ - అధైర్యం) కాదు, పిన్నీ. ఆ సంబంధం నాకు అంత యిష్టంగా లేదు.

రంగ: (కోపం - ఆశ్చర్యం) ఆఁ! నిజంగా? ఇదెప్పట్నుంచీ? నా ప్రయత్నం బూడిదపాలు చెయ్యదలుచుకున్నావా?

సత్యం: మొదటే చెప్దామనుకున్నా, పిన్నీ.

రంగ: పిన్నీ, పిడుగూ! ఎందుకు మాట వినని కొడికి? ఇదుగో, ఆలోచించు! శాంత మన యింట ఉంటేనే ఆస్తి నీతో ఉంటుంది.

సత్యం: అదేం, పిన్నీ? మీకు సగం. నాకు సగం. సగం నాకు వ్రాసియివ్వండి దత్తుణ్ణికాబట్టి.

రంగ: ఎవరికి దత్తుడివి? మేం ముందే చెప్పాం మీ వాళ్ళతో. శాంతని చేసుకోకపోతే నీకు యింట్లోది పూచికపుల్ల కూడా రాదు. బాగా ఆలోచించు.

సత్యం: అలా అంటారేం, పిన్నీ? దత్తతయ్యే! కర్మచేస్తినయ్యే! ఇంకా ఎవరికంటారేమి. శాంతని నేను చేసుకోలేని మాట నిజం.

రంగ: నీవు ఏంచేసుకున్నా సరే. శాంతని పెళ్ళిచేసుకుంటేనే ఆస్తి. అంతే. నీకు కాగితాలు, పత్రాలు ఏమీ లేవు. వ్రాసికూడా నే నిప్పుడు ఇవ్వలేను.

సత్యం: అంతేనా? నాకు ఇష్టంకాని శాంతను చేసుకోను.

రంగ: అలాగయితే నీ దారి నీది. మా దారి మాది.

• • •

నిస్సహాయి సత్యం. ఎట్టి లిఖితాధారం లేదు. అన్న పిత్రార్జితంలో పీలికకూడా రానివ్వడని తెలుసు. సత్యం తన పెట్టె తీసుకొని రంగమ్మకి నమస్కరించి కృంగిన హృదయంతో విశాలవిశ్వంలోకి పయనమయ్యాడు.

—

కాశ్మీర్
దగ్గులకు అమోఘమైనది
రాజమండ్రి

